సాక్షి మెదక్

సోమవారం । 18 । నవంబర్ । 2024



మరింత బలోపేతం

ఎస్‌హెచ్‌సీ సభ్యులకు వివిధ రకాల రుణాలకు సంబంధించిన వడ్డీ బకాయిలను ప్రభుత్వం మంజూరు చేసింది. వివరాలు 8లో ▸



తాగునీటి కష్టాలు

శివ్వంపేటలో తాగునీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజుల నుంచి తాగునీటి సరఫరా కావడం లేదు. వివరాలు 9లో ▸



ఆలయాలు కిటకిట

ఆలయాలు భక్తులతో ఆదివారం కిటకిటలాడాయి. ఈ సందర్భంగా దేవాతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

70.02 శాతం సమగ్ర సర్వే పూర్తి



తూప్రాన్‌లో ఇంటింటి సర్వేను పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

తూప్రాన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వే డివిజన్ పరిధిలో 70.02 శాతం పూర్తి అయిందని ఆర్డీఓ జయ చంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో కొనసాగుతున్న సర్వేను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 374 ఎన్యూమరేటర్లతో సర్వే జరుగుతోందన్నారు. చేగుంట మండలం 74.38 శాతం, తూప్రాన్ మున్సిపాలిటీ 71.80, మనోహరాబాద్ మండలం 71.40, తూప్రాన్ మండలం 72.57, మాసాయిపేట్ మండలం 65.87, వెల్దుర్తి మండలం 57.90, కాగా సర్వేలో నార్సింగి మండలం 78.32 శాతం పూర్తి చేసుకుని డివిజన్‌లో మొదటి స్థానంలో ఉందన్నారు. నార్సింగి తహసీల్దార్, ఎంపీడీఓలను అభినందించారు.

రెండో రోజుకు వాలీబాల్ పోటీలు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

చేగుంట (తూప్రాన్): ఎస్‌జీఎఫ్ అండర్ 14 రాష్ట్రస్థాయి వాలీబాల్ బాలబాలికల పోటీలు రెండోరోజైన ఆదివారం కూడా కొనసాగాయి. మండల కేంద్రమైన చేగుంట ఆదర్శ పాఠశాలలో నిర్వహిస్తున్న పోటీలకు జిల్లాల నుంచి క్రీడాకారులు తరలి వచ్చారు. సోమవారం క్రీడలు ముగియనున్నట్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి అల్లి నరేశ్ పేర్కొన్నారు. పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, పీడీ శారద, పీఈటీ మంజుల, వాలీబాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పరంజ్యోతి, కర్ణం గణేశ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక




ఎంపీ రఘునందన్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యుత్ శాఖ డీఈ చాంద్‌బాషా

మెదక్ కలెక్టరేట్: హైదరాబాద్‌లోని ఎంపీ రఘునందన్‌రావును ఆయన స్వగృహంలో మెదక్ విద్యుత్ శాఖ డీఈ చాంద్ షరీఫ్ బాషా ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మెదక్ విద్యుత్ శాఖ డీఈగా బాధ్యతలను ఆయన స్వీకరించారు.

హెల్ప్ డెస్క్‌తో దరఖాస్తుల స్వీకరణ

మెదక్ కలెక్టరేట్: నేడు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో హెల్ప్ డెస్క్ ద్వారా మాత్రమే ప్రజలు దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గ్రూప్–3 పరీక్షలు, సమగ్ర కుటుంబ సర్వేల్లో సంబంధిత శాఖల అధికారులు విధుల్లో నిమగ్నమై ఉన్నారని, అధికారులు ప్రజావాణికి అందుబాటులో ఉండరని తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



విద్యాసాగర్

తూప్రాన్: మెదక్ జిల్లా రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా రాజశేఖర్ రెడ్డి, ప్రధానకార్యదర్శిగా చూర్ణం విద్యాసాగర్‌లను ఎన్నుకున్నారు. కోశాధికారిగా రాజు, ఉపాధ్యక్షుడిగా శంకర్, సంయుక్త కార్యదర్శులుగా కిషన్, అశోక్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అస్లాంఖాన్, పోచయ్య, ఎగ్జిక్యూటివ్ గౌరవాధ్యక్షుడిగా షట్యయ్య, మెంబర్లుగా బాలకిషన్, యాదగిరి, అనిల్‌కుమార్, సత్యనారాయణ, రమేష్, కిషన్, రాజులు ఎన్నికయ్యారు. ఆదివారం మెదక్ కేంద్రంలో రాష్ట్ర రిటైర్డ్ పోలీస్ సంఘం ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ స్వామి ఆధ్వర్యంలో పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన సభ్యులు రిటైర్డ్ పోలీస్‌ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

గ్రూప్ 3 పరీక్షలు ప్రశాంతం

- అభ్యర్థుల హాజరు శాతం 54.27
- జూనియర్ కాలేజీలో కలెక్టర్ తనిఖీ

మెదక్‌జోన్: గ్రూప్3 పరీక్షలు తొలిరోజైన ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. సోమవారం కూడా ఎగ్జామ్ జరుగుతోంది. జిల్లావ్యాప్తంగా 5,867 మంది అభ్యర్థులకు 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం, మధ్యాహ్నం.. పరీక్షలు జరుగగా హాజరు 54.27 శాతంగా ఉంది. ఉదయం 5,867 మంది అభ్యర్థులకు గాను 3,187 మంది హాజరయ్యారు. 2,680 మంది గైర్హాజరయ్యారు. హాజరు 54.32 శాతంగా ఉంది. మధ్యాహ్నం 5,867 మందికి గాను 3,184 మంది పరీక్షకు కూర్చున్నారు. 2,683 మంది గైర్హాజరు కాగా హాజరు శాతం 54.27గా నమోదైంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్ తనిఖీ చేశారు. నిబంధనలు పకడ్బందీగా చేయాలని చీఫ్‌సూపరింటెండెంట్లను ఆదేశించారు. సోమవారం కూడా పరీక్ష ఉంటుందని అభ్యర్థులు గంట ముందే రావాలన్నారు.



మెదక్‌జోన్: మెదక్ ప్రభుత్వ బాలుర కళాశాల సెంటర్ వద్ద కలెక్టర్ రాహుల్‌రాజ్



మెదక్ మున్సిపాలిటీ: మంభోజిపల్లి పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

వరి కొయ్యలను కాలిస్తే ముప్పే!



కాల్చి వేస్తున్న వరికొయ్యలు

- భూమిలోని పోషకాలపై తీవ్రప్రభావం
- పంట దిగుబడి తగ్గే చాన్స్
- వాయుకాలుష్యంతో రైతులకు చేటు
- అవగాహన కల్పనకు వ్యవసాయ శాఖ సన్నద్ధం

మెదక్‌జోన్: మెదక్ జిల్లాలో 5 లక్షల పైచిలుకు ఎకరాల వ్యవసాయ భూములు ఉండగా 3.50 లక్షలపైచిలుకు ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా వరి 3 లక్షల ఎకరాలు సాగు చేస్తున్నారు. పంట కొయ్యలతోపాటు వాటి అవశేషాలను రైతులు కాల్చి వేస్తున్నారు. దీంతో భూసారంతో పాటు వాయుకాలుష్యంతో ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని వ్యవసాయ శాఖ చెబుతోంది. వాటిని తగలబెట్టవద్దని రైతులకు అవగాహన కల్పించేందుకు సిద్ధం అవుతోంది. ఒక వేళ తగలబెడితే చర్యలు తప్పవని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఢిల్లీ, పంజాబ్‌లాంటి రాష్ట్రాల్లో ఇలాంటి చర్యల వల్ల ఈ ప్రాంతాల్లో వాయుకాలుష్యంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. బడులకు సెలవులు ఇస్తున్నారు. ఆ పరిస్థితి మన రాష్ట్రంలో రావద్దంటే వరి, ఇతర పంటల అవశేషాలు కాల్చవద్దని హెచ్చరిస్తున్నారు.

వరి కొయ్యలు, ఆయా పంటల అవశేషాలను దహనం చేయరాదు. ఒకవేళ చేస్తే తీవ్ర నష్టం జరగొచ్చు. భూమిలోని పోషకాలు తగ్గి దిగుబడి పడిపోవచ్చు. పంటకు మేలు చేసే పోషకాలు దెబ్బతింటాయి. ముఖ్యంగా నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం ఆవిరై భవిష్యత్‌లో పంటల ఉత్పాదకపై ప్రతికూల ప్రభావం పడనుంది. అంతేకాదు వాయుకాలుష్యం వల్ల రైతు ఆరోగ్యానికి చేటు కూడా. అందువల్ల వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించేందుకు సన్నద్ధం అవుతున్నారు.

దుక్కిలో దున్నేస్తేనే మేలు



కొయ్యలు, ఇతర అవశేషాలు తగలబెట్టడంతో భూసారం దెబ్బతింటుంది. భవిష్యత్‌లో పంటల దిగుబడి గణనీయంగా తగ్గొచ్చు. వాయుకాలుష్యంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది. వాటిని తగలబెట్టకుండా దుక్కిలో దున్నేస్తే సేంద్రియ ఎరువులు తయ్యారవుతాయి. కొయ్యలను తగలబెట్టితే రైతులపై చర్యలు తప్పవు.

– గోవింద్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, మెదక్

కొయ్యలను కాలిస్తే జరిగే నష్టాలివే

- పంటల అవశేషాల కాల్చటంతో వాయుకాలుష్యం పెరుగుతుంది. ఊపిరితిత్తుల సంబంధిత ఆరోగ్య సమస్యలు కలుగుతాయి.
- మట్టిలోని సూక్ష్మజీవులు దెబ్బతిని, మట్టి జీవచక్రం అస్తవ్యస్తంగా మారుతుంది.
- దహనం వల్ల మట్టిలోని నీటినిల్వ సామర్థ్యం తగ్గుతుంది. పంటలకు నీటి అవసరం పెరుగుతుంది.

భూసారం పెంపునకు దోహదం

- వరికొయ్యలు, ఇతర అవశేషాలు తగలబెట్టకుండా నేలలో కలియదున్నితే అవి సహజ సేంద్రియ ఎరువులుగా మారి భూసారం పెరుగుతుంది. కంపోస్టు ఎరువులుగా తయారు చేసుకోవచ్చు. పశువులకు మేతగా ఉపయోగించవచ్చు.
- వరి కొయ్యలను మల్చింగ్ పదార్థంగా వాడటం వల్ల నేల తేమశాతం పెరుగుతుంది. మొక్కకు కూడా అనుకూల వాతావరణం లభిస్తుంది.

రాజకీయాల్లో గూండాయిజం, రౌడీయిజం చెల్లవ్



ప్రసంగిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాపాలన విజయోత్సవ సభలో మంత్రి దామోదర రాజనర్సింహ

జోగిపేట(అందోల్): రాజకీయాల్లో గూండాయిజం, రౌడీయిజం చెల్లదని మంత్రి సి.దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం అందోల్ నియోజకవర్గం జోగిపేట పట్టణంలో ఉన్న ఎన్టీఆర్ గ్రౌండ్‌లో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ సభకు ముఖ్యఅతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు. ప్రజాస్వామ్యంలో అందరికీ ప్రశ్నించే, మాట్లాడే స్వేచ్ఛ ఉంటుందన్నారు. తాము కూడా గత ప్రభుత్వం చేసిన తప్పిదాలపై శాంతియుతంగా పోరాటాలు నిర్వహించామన్నారు. కానీ ప్రస్తుత ప్రతిపక్ష పార్టీ నేతలు కలెక్టర్ స్థాయి అధికారులపై దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. అందుకు వికారాబాద్ జిల్లా లగచర్లలో జరిగిన సంఘటనే నిదర్శనమన్నారు. ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు చేసిన కుట్రలు బయటపడగా అందులో నుంచి బయట పడేందుకు ఢిల్లీస్థాయిలో పైరవీలు చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం నిర్మాణంలో లక్ష కోట్ల రూపాయల దోపిడీ జరిగిందన్నారు. 32 వేల ఎకరాలు ముంపునకు గురైతే 1600 మంది రైతులు కోర్టును ఆశ్రయించి ప్రతీకేసును గెలిచారన్నారు. మల్లన్న సాగర్ నిర్మాణంలో ఎకరాకు రూ.5 లక్షలు ఇస్తామని గత ప్రభుత్వం ప్రకటిస్తే ఇందుకు రైతులు వ్యతిరేకించి శాంతియుతంగా 966 రోజులపాటు దీక్ష చేపట్టి రూ.12 లక్షలకు పరిహారాన్ని పెంచుకోగలిగారని గుర్తుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 నర్సింగ్ కళాశాలలు, 28 డైట్ కళాశాలలు, ఎనిమిది మెడికల్ కళాశాలలు మంజూరయ్యాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారలలోకి వచ్చిన 11 నెలల్లోనే 54 వేల పోస్టులను భర్తీ చేసిందన్నారు. పదేళ్ల తర్వాత సంక్షేమ హాస్టల్‌లలోని విద్యార్థులకు కాస్మోటిక్, డైట్ చార్జీలను 60 శాతానికి పైగా పెంచామన్నారు. త్వరలోనే రూ.2లక్షల రుణమాఫీని సంపూర్ణంగా చేయబోతున్నామన్నారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లు నిర్మల, గిరిధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చంద్రశేఖర్, మదన్‌రెడ్డి, జగ్గారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

ముగిసిన గొట్టంకోట జాతర ఉత్సవాలు

జహీరాబాద్ టౌన్: కార్తీక పౌర్ణమి సందర్భంగా మూడు రోజులుగా నిర్వహిస్తున్న గంగాధర బక్క ప్రభు, భవానీ మాత ఆలయాల జాతర ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాలను పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించారు. చివరి రోజు కనుల పండువగా రథోత్సవం నిర్వహించారు. తెలంగాణ, కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో యాత్రీకులు తరలి వచ్చారు. కార్తీక దీపాలను వెలిగించారు. అన్నదానం గావించారు. ఉత్సవాలు ముగిసే వరకు అడవిలోనే ఉంటారు. సామూహిక వనభోజనాలు చేస్తూ పిల్లపాపలతో అడవి అందాలను చూస్తూ ఆహ్లాదంగా గడుపుతారు. కాగా అడవి మధ్యలో ఈ ఆలయాలు ఉంటాయి.

దుర్గమ్మా .. సల్లంగా చూడమ్మా

పాపన్నపేట (మెదక్): దుర్గమ్మ మమ్మల్ని సల్లంగా చూడమ్మా అంటూ భక్తులు వేడుకున్నారు. ఆదివారం ఏడుపాయల భక్తజనులతో జనసంద్రగా మారింది. అర్చకులు శంకర శర్మ, పార్థీవ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఒడి బియ్యం పోసి, బోనాలు తీసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.



హారతి ఇస్తున్న అర్చకుడు



ఆలయంలో భక్తుల రద్దీ

పాలకవర్గ ఏర్పాటుకు నోటిఫికేషన్

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల ఆలయ నూతన పాలకవర్గ ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఈఓ చంద్రశేఖర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 20 రోజులలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వనభోజనాలతో ఆత్మీయత

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

పటాన్‌చెరు టౌన్: కార్తీక మాసంలో ఆత్మీయత వెల్లిరిసేందుకే వనభోజన కార్యక్రమాలని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదివారం మైత్రీ మైదానంలో శ్రీకృష్ణదేవరాయ కార్తీక వనభోజనాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనభోజనాల నిర్వాహకులు కేంద్ర సహాయక మంత్రిని సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, మున్నూరు కాపు సంఘం పెద్దలు భిక్షపతి పాల్గొన్నారు.



కేంద్ర సహాయక మంత్రి సంజయ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

చర్చిని సందర్శించిన పాస్నెట్ రక్తసంబంధీకులు

మెదక్‌జోన్: ఇంగ్లాండ్ దేశస్తుడు చార్లెస్ వాకర్ పాస్నెట్ నిర్మించిన ప్రపంచ ప్రఖ్యాత మెదక్ సీఎస్ఐ చర్చిని ఆయన సోదరి పిల్లలు సందర్శించారు. విదేశాల్లో స్థిరపడిన ఆయన రక్తసంబంధీకులు ఆదివారం తిలకించేందుకు వచ్చారు. చర్చి ప్రాంగణాన్ని కలియ తిరిగి సంబరపడ్డారు. నిర్వాహకులు ప్రత్యేక ప్రార్థనలు చేసి వారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.



పాస్నెట్ రక్తబంధీకులతో చర్చి నిర్వాహకులు

కలవని 'చేతులు'!

- సంగారెడ్డిలో కాంగ్రెస్ నేతల సమన్వయ లోపం
- పటాన్‌చెరు ముఖ్యనేతల్లోను కుదరని సయోధ్య
- నారాయణఖేడ్‌లోను అదే సీన్
- జహీరాబాద్‌లో మూడు వర్గాలుగా విడిపోయిన కేడర్
- నేడు కాంగ్రెస్ పార్టీ జిల్లా సమావేశానికి పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విబేధాలు కొనసాగుతున్నాయి. పదేళ్ల ప్రతిపక్షంలో ఉన్న పార్టీ గతేడాది అధికారంలోకి వచ్చాక కూడా వర్గ విబేధాలు కొనసాగుతున్నాయి. ఆయా చోట్ల రెండు, మూడు వర్గాలుగా విడిపోయిన నేతలు ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లలో పార్టీ క్యాడర్ ఎటువైపు వెళ్లాలనే దానిపై అయోమయం నెలకొంది. ఒక్క అందోల్ నియోజకవర్గం మినహా జిల్లాలో మిగిలిన నాలుగు చోట్ల అంతర్గత పోరు ఉంది. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ హాజరుకానున్నారు. మంత్రులతో పాటు, పార్టీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్‌ల రాష్ట్ర చైర్మన్లు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొంటారు.

జహీరాబాద్‌లో మూడు వర్గాలు

జహీరాబాద్ నియోజకవర్గంలో పార్టీ క్యాడర్ మూడు వర్గాలుగా విడిపోయిన విషయం విదితమే. మాజీ మంత్రి చంద్రశేఖర్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డిలు ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇద్దరు ప్రత్యేకంగా కార్యాలయాలను ఏర్పాటు చేసుకుని కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఎంపీ సురేశ్ షెట్కార్ కూడా తన కార్యాలయాన్ని ఇక్కడే ప్రారంభించడంతో ఈ నియోజకవర్గంలో క్యాడర్ మూడు వర్గాలుగా విడిపోయింది.

సంగారెడ్డిలో ఇలా..

సంగారెడ్డి నియోజకవర్గంలో పాత, కొత్త నేతల దూరం కొనసాగుతోంది. పార్టీలోకి కొత్తగా వచ్చిన వారిని కలుపుకొని పోవడం లేదని అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన పులిమామిడి రాజుతో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఇలా కొత్తగా పార్టీలోకి వచ్చిన నేతలకు, పాత నేతలకు మధ్య సమన్వయం లేకుండా పోయింది. పార్టీ కార్యక్రమాలకు తమకు కనీసం సమాచారం ఇవ్వడం లేదని పులిమామిడి రాజు వంటి నేతలు వాపోతున్నారు.

పటాన్‌చెరులో ఎవరికి వారే..

పటాన్‌చెరు నియోజకవర్గంలో నేతలు ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిల మధ్య సయోధ్య కుదరడం లేదు. మరోవైపు వీరిద్దరితో మెదక్ ఎంపీగా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన నీలం మధుకు కూడా దూరం పెరిగింది. ఈ నియోజకవర్గంలోను పాత కొత్త నేతల మధ్య పొసగడం లేదు.

'ఖేడ్'లోనూ..

నారాయణఖేడ్‌లో కాంగ్రెస్ క్యాడర్ మొదటి నుంచి రెండు వర్గాలుగా ఉంది. ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డిల మధ్య విభేదాలు ఉన్నప్పటికీ గత ఎన్నికల్లో ఇద్దరు కలిసి పని చేశారు. తద్వారా ఇద్దరు కూడా విజయం సాధించారు. ఇక్కడి వరకు బాగానే ఉంది. మండల స్థాయి క్యాడర్ మాత్రం రెండు వర్గాలుగా కొనసాగుతోంది. ఓ మండలంలో ఈ రెండు వర్గాల నేతలు ఇటీవల చిన్నపాటి గొడవకు దిగినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటి వరకు ఇక్కడ విభేదాలు బయటపడలేదు కానీ అంతర్గతంగా మాత్రం రగులుతూనే ఉన్నాయనే అభిప్రాయం ఉంది. మంత్రి దామోదర రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న అందోల్‌లో మాత్రం ఈ పరిస్థితి లేదు. కానీ మిగిలిన నాలుగుచోట్ల కాంగ్రెస్ క్యాడర్ 'చేతులు' కలవడం లేదనే అభిప్రాయం రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతోంది. అయితే సోమవారం నిర్వహించనున్న పార్టీ సమీక్ష సమావేశంలో ఆయా నేతల మధ్య నెలకొన్న ఈ వర్గ విభేదాలు బహిర్గతమయ్యే అవకాశాలు లేకపోలేదనే భావన వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

కారు ఢీకొని యువకుడి మృతి


కౌశిక్ కళ్యాణ్ రెడ్డి

నర్సాపూర్ రూరల్: ద్విచక్రవాహనంపై వేగంగా వెళ్తూ అదుపుతప్పి పడిపోయిన ఓ యువకుడిని కారు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణంపాలయ్యాడు. నర్సాపూర్–హైదరాబాద్ జాతీయరహదారిలోని కొండాపూర్ అటవీ ప్రాంతంలో ఆదివారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన అల్లం విక్రంరెడ్డి కుమారుడు కౌశిక్ కళ్యాణ్‌రెడ్డి(19), అతడి స్నేహితుడు రుషిల్ ఇద్దరూ కలసి చెరో రెండు బైక్‌లపై రైడింగ్‌కు వెళ్లారు. ఇద్దరూ సంగారెడ్డి జిల్లా జోగిపేటకు వెళ్లి తిరిగి నర్సాపూర్ మీదుగా హైదరాబాద్‌కు వస్తుండగా కొండాపూర్ అటవీ ప్రాంతంలోని మూల మలుపు వద్ద అదుపు తప్పి కల్యాణ్‌రెడ్డి కిందపడిపోయాడు. సరిగ్గా అదే సమయంలో ఎదురుగా వస్తున్న కారు కల్యాణ్‌రెడ్డిని ఢీ కొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పంచనామా నిమిత్తం మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చెరువులో పడి యువకుడి మృతి


జగపతిబాబు మృతదేహం

అల్లాదుర్గం(మెదక్): ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి చెందిన ఘటన అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముస్లాపూర్ తండాలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన పెద్దలంక జగపతిబాబు(27) కొద్ది రోజుల క్రితం తాపీ పనులకోసం ముస్లాపూర్ గ్రామానికి వచ్చాడు. అయితే శనివారం ముస్లాపూర్ గ్రామం నుంచి బయటకు వెళ్లిన జగపతిబాబు తిరిగి రాలేదు. ఆదివారం ముస్లాపూర్ తండా శివారులోని చెరువులో శవమై కనిపించారు. అయితే మృతుడికి మూర్ఛరోగం ఉండటంతో నీటిలో పడి చనిపోయి ఉంటారని తోటి కూలీలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వలస కూలీలను తీసుకొచ్చిన హరిబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

మరింత బలోపేతం



మహిళా సంఘాలకు రూ.కోటి 35లక్షల వడ్డీ విడుదల

- డిసెంబరు నుంచి మార్చి వరకు అందించినప్రభుత్వం
- నేరుగా సభ్యుల ఖాతాల్లో జమ

సంగారెడ్డి జోన్: జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు వివిధ రకాల రుణాలకు సంబంధించిన వడ్డీ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామాల్లోని సంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సభ్యులకు బ్యాంకుల ద్వారా వివిధ రకాల రుణాలను మంజూరు చేస్తుంది. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించిన మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం వడ్డీ మాఫీ చేస్తూ ఆ నిధులను వారి ఖాతాల్లో జమ చేస్తుంది. నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం సంఘాల బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగానే ఇందిరి మహిళా శక్తి రుణాలను మంజూరు చేస్తూ ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతుంది.

జిల్లాలో 18,198 స్వయం సహాయక సంఘాలు

జిల్లాలోని వివిధ గ్రామాల్లో 18,198 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. అయా సంఘాలలో 1,90,381 మంది సభ్యులు ఉన్నారు. సంఘాలలోని సభ్యులకు వివిధ పథకాలు రుణాలు బ్యాంకుల ద్వారా మంజూరు చేసి ఆదాయం వచ్చే ఆస్తులను కొనుగోలు చేసి, ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తారు. బ్యాంకు లింకేజి, స్త్రీనిధితో పాటు వివిధ రకాల రుణాలను అందిస్తారు. సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుంది. ఆ విధంగా చెల్లించిన సంఘాలకు ప్రభుత్వం తిరిగి వడ్డీని నేరుగా సభ్యుల ఖాతాల్లో జమ చేస్తుంది. గత ప్రభుత్వ హా యంలో 3 సంవత్సరాలుగా విడుదల చేయాల్సిన వడ్డీ నిలిపివేసింది. దీంతో మహిళా సంఘాల సభ్యులు వడ్డీ కోసం ఎదురుచూసిన పరిస్థితులున్నాయి. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ బకాయిలను వెంటవెంటనే విడుదల చేస్తుంది.

రూ.కోటి 35లక్షల వడ్డీ విడుదల

గత ఆర్థిక సంవత్సరంలోని డిసెంబరు నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వడ్డీ బకాయిలను విడుదల చేసింది. గత కొన్ని నెలల క్రితం డిసెంబరు, జనవరి నెలలకు సంబంధించిన వడ్డీ బకాయిలు విడుదల చేసింది. తాజాగా ఫిబ్రవరి, మార్చికి సంబంధించిన 1,35,51,598 రూపాయలు మంజూరు చేసింది. నాలుగు నెలలకు సంబంధించి 17,014 గ్రూపులకు రూ.1,345.36లక్షలను విడు దల చేసింది. విడుదల అయిన వడ్డీ నేరుగా సభ్యుల ఖాతాల్లో జమ అవుతుంది. దీంతో మహి ళా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్వయం ఉపాధితోపాటు ఇతరులకు ఉపాధి

మహిళా సంఘాలలో సభ్యులు తీసుకున్న రుణాలతో ఇతరులపై ఆధారపడకుండా తాను ఆర్థికంగా ఎదగటంతోపాటు మరికొంత మందికి ఉపాధిని సైతం చూపిస్తున్నారు. జిల్లాలో చాలా చోట్ల వివిధ రకాల రుణాలను తీసుకుని క్యాంటిన్, పెరటికోళ్లపెంపకం, గేదెల షెడ్డు (పాల ఉత్పత్తి)తో ఇతరులకు ఉపాధి చూపించే రంగాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. సభ్యులకు రుణాలను అందించటమే కాకుండా వారు ఆదాయం వచ్చే యూనిట్లు ఏర్పాటు చేసేందుకు అవగాహన కల్పిస్తూ చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో మండలాల వారీగా విడుదలైన వడ్డీ నిధులు

మండలం	గ్రూపులు	విడుదలైన వడ్డీ (రూ.ల్లో)
అమీన్‌పూర్	9	40,426
అందోల్	82	3,13,528
గుమ్మడిదల	59	2,41,319
హత్నూర	207	9,43,410
ఝరాసంగం	355	13,25,283
జిన్నారం	50	2,04,383
కల్హేర్	66	2,21,342
కంది	91	3,87,588
కంగ్టి	80	3,10,404
కోహీర్	395	13,13,785
కొండాపూర్	126	4,88,379
మనూర్	53	1,95,918
మొగుడంపల్లి	223	6,21,718
మునిపల్లి	124	5,08,515
నాగిల్‌గిద్ద	55	1,70,622
నారాయణఖేడ్	155	51,395
న్యాల్‌కల్	443	13,82,264
పటాన్‌చెరు	152	7,36,685
పుల్కల్	85	3,25,896
రాయికోడ్	155	6,62,317
సదాశివపేట	112	5,28,597
సంగారెడ్డి	63	2,38,236
సిర్గాపూర్	57	2,21,591
వట్‌పల్లి	72	4,01,756
జహీరాబాద్	425	12,53,691

సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి



మహిళా సంఘాల సభ్యులు సంఘం ద్వారా తీసుకున్న రుణాలు ఆదాయం వచ్చే మార్గాన్ని ఎంచుకుని రుణాలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం విడుదల చేసిన వడ్డీ నిధులు నేరుగా సభ్యుల ఖాతాల్లో జమ అవుతాయి. తీసుకున్న రుణాలు వాయిదాల ప్రకారం చెల్లించి, తిరిగి రుణం పొందవచ్చు. ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికి అందించటం జరుగుతుంది. –జ్యోతి, డీఆర్‌డీఓ, సంగారెడ్డి జిల్లా

రెక్కాడక.. పూట గడవక


ఆర్థికసాయం కోసం ఎదురుచూస్తున్న నిరుపేద దంపతులు

- వస్తులుంటున్న నిరుపేద కుటుంబం
- నాలుగు గుంజల పందిరే నివాసం
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు

జగదేవ్‌పూర్ (గజ్వేల్): రెక్కాడితే కానీ పూట గడవని నిరుపేద కుటుంబం.. కనీసం తల దాచుకోవడానికి గూడు లేని దుస్థితి.. నాలుగు గుంజల పందిరే దిక్కు... కష్టం చేద్దామన్నా సహకరించని ఆరోగ్యం.. దీంతో ఆ కుటుంబం ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది. వివరాలిలా ఉన్నాయి. జగదేవ్‌పూర్ మండలంలో తిగుల్ గ్రామానికి చెందిన మన్నె శ్రీనివాస్ గత పదిహేనేళ్ల క్రితం మహబూబ్‌నగర్‌కు చెందిన జ్యోతితో వివాహం జరిగింది. వీరికి ఓ కూతురు. ప్రస్తుతం స్థానిక పాఠశాలలోనే పదో తరగతి చదువుతోంది. గ్రామంలోనే ఓ పూరి గుడిసెలోనే ఉంటూ కూలి చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మూడేళ్ల క్రితం భార్య జ్యోతి తీవ్ర అనారోగ్యం బారిన పడింది. భార్యను వైద్య నిమిత్తం ఆస్పత్రుల చుట్టూ తిప్పినా ఆమె ఆరోగ్యం మాత్రం కుదుట పడలేదు. అనారోగ్యంతో మంచానికే పరిమితమైపోయిన భార్యను చూసుకోవడంతోపాటు కుటుంబ పోషణకూడా శ్రీనివాస్ చూసుకుంటుండటంతో జీవనం కష్టమైపోయింది. వీటికితోడు వీరు నివసించే గుడిసె కూడా ఇటీవలే కూలిపోయింది. మరో గూడు ఏర్పాటుకు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో నాలుగు గుంజల పందిరి కిందనే కుటుంబం మొత్తం తలదాచుకుంటున్నారు. చుట్టూ కనీసం కవరు కూడా లేకపోవడం వల్ల చలికి వణుకుతూ జీవనం సాగిస్తున్నారు. నిరుపేద కుటుంబం అయినప్పటికీ గత ప్రభుత్వ హయాంలో కూడా కనీసం డబుల్ బెడ్రూం ఇళ్లు రాలేకపోయింది. ప్రస్తుతం ప్రభుత్వం, మానవతావాదులు స్పందించి నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. నిరుపేద కుటుంబం ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు.

నీడ కల్పించాలి..



భార్య అనారోగ్యంతో మంచాన పడింది. కనీసం ఉండేందుకు కూడా ఇల్లు లేదు. గూడు కల్పించి సరైన వైద్యం అందిస్తే మేలు. పేద కుటుంబం కాబట్టి ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. –శ్రీనివాస్, తిగుల్

కూలి డబ్బుల తగాదా.. తాపీమేస్త్రీ హత్య

కూలి డబ్బుల విషయంలో మాటామాటా పెరిగి...


ఘటనాస్థలం వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మనోహరాబాద్(తూప్రాన్): కూలి డబ్బుల తగాదా కాస్తా తాపీమేస్త్రీ ప్రాణం తీసింది. మనోహరాబాద్ పోలీసుస్టేషన్ పరిధిలోని కాళ్లకల్ గ్రామంలో ఆదివారం జరిగిన ఘటన వివరాలిలా ఉన్నాయి. తాపీ మేస్త్రీగా పనిచేస్తున్న ప్రమోద్ పాశ్వాన్ (55), బిట్టు దంపతులు కొంతమంది కూలీలతో కలసి భవన నిర్మాణ పనులు చేస్తున్నారు. అయితే అదే గ్రామంలోని శ్రీరామ్ పండరి హైదరాబాద్‌లో ఇంటిని నిర్మిస్తున్నాడు. ఇంటి నిర్మాణపనుల కోసం బిట్టు కూలీలను తీసుకొస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి తాపీమేస్త్రీ ప్రమోద్ పాశ్వాన్‌కు బిట్టుకు కూలి డబ్బుల విషయంలో గొడవ జరిగింది. ఇద్దరి మధ్యా మాటామాటాపెరిగిన క్రమంలో బిట్టు ఆవేశం ఆపుకోలేక దగ్గర్లోనే ఉన్న కట్టెతో పాశ్వాన్ తలపై బలంగా మోదాడు. దీంతో అక్కడికక్కడే పాశ్వాన్ కుప్పకూలిపోయి మృతి చెందాడు. వెంటనే బిట్టు పారిపోగా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి వచ్చి వివరాలు సేకరించారు. నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పుట్ట నరేశ్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

తులసి మొక్కకు పూజ చేస్తుండగా

- మహిళ మెడలో గొలుసు చోరీ
- ద్విచక్ర వాహనంపై వచ్చిన దుండగులు
- సీసీ కెమెరాలో దుండగుల దృశ్యాలు నమోదు


సీసీ కెమెరాలో రికార్డైన దుండగుల దృశ్యాలు

పటాన్‌చెరు టౌన్: తులసి చెట్టుకు పూజ చేస్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు కాజేసుకుని పరారయ్యారు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. పటాన్‌చెరు శ్రీనగర్ కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ నేత శ్రీధర్ చారి తల్లి సోమలక్ష్మి కార్తీకమాసం కావడంతో ఆదివారం ఇంటి ముందు తులసి కోట వద్ద పూజ చేసుకుంటుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె మెడలో 4 తులాల బంగారు గొలుసును దొంగిలించుకుని వెళ్లారు. ఒక వ్యక్తి శిరస్త్రాణం పెట్టుకుని బైక్‌పై వేచి ఉండగా, మరో వ్యక్తి మాస్కు ధరించి, ఈ దొంగతనానికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా, కాలనీ చెందిన సీసీ ఫుటేజీలో రికార్డైన దుండగుల దృశ్యాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఆరుగురి ఆత్మహత్య

''ధనం మూలం ఇదం జగత్'' అనే నానుడి ఎప్పటికీ అక్షర సత్యమని నిరూపిస్తూ ఉంటాయి కొన్ని ఘటనలు. తగిన ఆర్థిక స్తోమత లేకపోవడంతో తక్షణావసరాలకోసం అప్పులు చేయడం మనిషికి తప్పడమూలేదు. దీంతో అప్పులే యమపాశాలై మనిషి ప్రాణాలు బలిగొంటున్నాయి. అప్పులు భారమై వాటిని తీర్చే దారిలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఆర్థికపరమైన ఇబ్బందులు, అప్పుల వారి ఒత్తిళ్లు, భూ వివాదాలు వంటి కారణాలతో ఆరుగురు ఆత్మహత్య చేసుకోవడంతో ఆదివారం ఉమ్మడి మెదక్ జిల్లాలో విషాదం నెలకొంది.

కుటుంబ కలహాలతో

చిన్నకోడూరు(సిద్దిపేట): కుటుంబ కలహాలతో రైతు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన చిన్నకోడూరులో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కర్నె రాంరెడ్డి(65), యాదవరెడ్డి సోదరులు. గత కొద్ది రోజులుగా రాంరెడ్డి, తమ్ముడు యాదవరెడ్డిల మధ్య వ్యవసాయ భూ పంపిణీ విషయంలో గొడవలు జరుగుతున్నాయి. అలాగే తల్లి లక్ష్మి పోషణ విషయంపై ఇరువురి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగాయి. అయినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో మనస్తాపం చెందిన రాంరెడ్డి ఆదివారం తెల్లవారుజామున పొలం వద్దకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకులు గమనించేసరికి రాంరెడ్డి మృతి చెందాడు. మృతుడు రాంరెడ్డికి భార్య తారవ్వ, కొడుకు సుధాకర్‌రెడ్డి ఉన్నారు. సుధాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

అప్పులు భారమై వ్యక్తి ఆత్మహత్య

దుబ్బాకటౌన్ : కొడుకు అనారోగ్యం ఓ వైపు, మరోవైపు వ్యవసాయం కోసం చేసిన అప్పులు పెరిగిపోవడంతో వాటిని తీర్చే మార్గం తెలీక ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాయపోల్ మండల కేంద్రంలో ఆదివారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. రాయపోల్ మండల కేంద్రానికి చెందిన ఉషన గళ్ల రాములు (56) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుమారుడు అనారోగ్యం పాలవడంతో తెలిసినవారివద్ద అప్పులు చేసి వైద్యం చేయిస్తున్నాడు. ఇక వ్యవసాయం కోసం చేసిన అప్పులు కూడా తోడవడంతో మనోవ్యధకు గురైయ్యాడు. దీంతో అప్పులు ఎలా తీర్చాలో మార్గం తెలీక మనస్తాపం చెందిన రాములు శనివారం రాత్రి అందరూ నిద్రపోయాక ఇంటిబయట ఉన్న మామిడి చెట్టుకు ఉరిపోసుకున్నాడు. తెల్లవారుజామున భార్య పోచవ్వ బయటకు వచ్చి చూడగా రాములు మామిడి చెట్టుకు వేలాడుతూ కన్పించాడు. వెంటనే కుమారుడు, కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారి సహాయంతో చికిత్స నిమిత్తం గజ్వేల్ ఆసుపత్రికి తరలించగా...పరిశీలించిన రాములు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అప్పుల బాధ తాళలేక..

మిరుదొడ్డి(దుబ్బాక): తమ్ముడు, చెల్లెలి పెళ్లిళ్ల కోసం అన్న చేసిన అప్పులు తడిసి మోపెడయ్యాయి. వీటికి తోడు వ్యవసాయం అచ్చిరాకపోవడంతో తెచ్చిన అప్పులకు మిత్తీలు పెరిగిపోయాయి. దీంతో అప్పుల బాధ తాళలేక అన్న ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఆదివారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుడ్డోళ్ళ మల్లేశం, మల్లవ్వ దంపతుల పెద్ద కుమారుడు బాల్‌రాజు(32) తనకున్న మూడెకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ భార్య భవాని, కూతురు శాన్వీ (4)తో పాటు, తల్లి మల్లవ్వను పోషించుకుంటున్నాడు. కాగా మృతుడు బాల్‌రాజు తండ్రి మల్లేశం గత 15 ఏళ్ల క్రితం ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబ భారం బాల్‌రాజుపై పడింది. కాలక్రమంలో తన తమ్ముడు చెల్లెలు పెళ్లిళ్ల కోసం సుమారు రూ.5 లక్షల వరకు అప్పు చేసి వివాహాలు చేశాడు. వ్యవసాయం కలసి రాకపోవడంతో తెచ్చిన అప్పులకు మిత్తీలు పెరిగి పోయాయి. దీంతో అప్పుల వారి నుంచి నిత్యం ఒత్తిడి రావడంతో దిగులు పడుతుండేవాడు. శనివారం సాయంత్రం వ్యవసాయ పొలం వద్దకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి బాల్‌రాజు ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో కుటుంబసభ్యులు రాత్రి బాల్‌రాజ్‌ను వెదుక్కుంటూ వ్యవసాయపొలం వద్దకు వెళ్లి చూడగా బాల్‌రాజు చెట్టుకు ఉరివేసుకుని వేలాడుతూ కన్పించాడు. పోలీసులకు సమాచారం అందించగా ఘటనాస్థలికి చేరుకుని బాలరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కుడుపునొప్పి తాళలేక యువతి...

మర్కూక్(గజ్వేల్): కుడుపు నొప్పి భరించలేక ఓ యువతి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గజ్వేల్ మండలం యుసుఫ్‌ఖాన్‌పల్లి గ్రామంలో శనివారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కెన్వార్ సోనుభాయ్ (20)ను 7 నెలల క్రితం అదే గ్రామనికి చెందిన మేనబావ కేన్వార్ అమర్‌సింగ్‌కు ఇచ్చి వివాహం చేశారు. అయితే వివాహానికి ముందునుంచే సోనుభాయ్ కొద్దికాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేది. వివాహం అనంతరం గత ఐదు రోజుల నుంచి కడుపునొప్పి వస్తుండటంతో శనివారం తన తల్లి పద్మినీభాయ్‌కి చెప్పగా...ఆస్పత్రికి తీసుకెళ్తాను ఇంటివద్దే ఉండమని చెప్పింది. ఆమె వచ్చేలోపే కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఉన్న పైప్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

చెరువులో దూకి..

వెల్దుర్తి(తూప్రాన్): ఆర్థిక ఇబ్బందులు, అప్పులు ఇచ్చిన వారి వేధింపులతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వెల్దుర్తి పోలీసుస్టేషన్ పరిధి కొప్పులపల్లి గ్రామ శివారులో ఆదివారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గెంట్యల ప్రభాకర్(35) తూప్రాన్‌లో డిజిటల్ ప్రింటింగ్ నడుపుతున్నాడు. ఈ నెల 14న మధ్యాహ్నం సమయంలో దుకాణానికి వెళ్తున్నానని స్కూటీపై ఇంటినుంచి బయటకు వెళ్లాడు. ఆదివారం ఉదయం వరకు ఇంటికి చేరుకోకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో బంధువులు, చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో ఆదివారం గ్రామశివారులోని ఊరి చెరువులో యువకుడి మృతదేహం తేలిఉందన్న సమాచారం మేరకు ప్రభాకర్ తల్లి చంద్రమ్మ వెళ్లి చూడగా మృతదేహం తన కుమారుడిదిగా గుర్తించారు. మృతదేహం ప్రక్కనే చెరువులో స్కూటీ కూడా పడి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. కాగా, ఘటనా స్థలంలో తన మృతికి వేధింపులే కారణమంటూ వేర్వేరుగా సెప్టెంబర్ 20వ తేదీన రాసినట్లు ఉన్న మూడు సూసైడ్‌నోట్‌లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

భోజనానికి వెళ్లొస్తానని..

సంగారెడ్డి క్రైమ్: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సంగారెడ్డి మండలంలోని బాలాజీనగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. కొద్ది రోజుల క్రితం రాజస్థాన్ నుంచి సంగారెడ్డికి పని నిమిత్తం వలస వచ్చిన కేతరామ్ (20) ప్రేమ్ భీష్ణోయ్ అనేవ్యక్తితో కలసి ఒకే గదిలో ఉంటున్నాడు. జీవనోపాధి కోసం బైపాస్‌రోడ్డు వద్ద ఉన్న రవీందర్‌రెడ్డికి చెందిన ఓ స్వీట్ షాపులో పనిచేస్తున్నాడు. రోజులాగే ఆదివారం ఉదయం పనికి వచ్చి, మధ్యాహ్నం భోజనానికి వెళ్లాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో ప్రేమ్ భీష్ణోయ్ తన గదికి వెళ్లి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కన్పించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

అదృశ్యమైన యువకుడు శవమై తేలి...


రాజు (ఫైల్)

టేక్మాల్ (మెదక్): అదృశ్యమైన యువకుడు బావిలో శవమై తేలాడు. ఈ ఘటన టేక్మాల్ మండలంలోని దాదాయిపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. దాదాయిపల్లి గ్రామానికి చెందిన కోటంగారి రాజు (23) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నిత్యం మాదిరిగానే ఈ నెల 13న ఉదయం పొలానికి వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి అయినా రాజు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎంత వెదికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు మృతుడి తండ్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావిలో శవమై తేలి కనిపించగా కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

భలే బేలర్..

హార్వెస్టర్‌తో వరి కోతలు.. బేలర్‌తో గడ్డికట్టలు కట్టడం

- బేలర్ యంత్రంపై ఆసక్తి చూపుతున్న రైతులు
- ఈ ఏడాది వరి గడ్డికి భలే డిమాండ్
- కట్టకు రూ.30 నుంచి 35 వసూలు


దుబ్బాకలో హార్వెస్టర్‌తో కోసిన గడ్డిని కట్టలు కడుతున్న బేలర్ యంత్రం

దుబ్బాకటౌన్: కాలం మారేకొద్దీ వ్యవసాయంలో యాంత్రీకరణ వినియోగం పెరుగుతుండటమే కాదు ఏకంగా శాసిస్తోంది కూడా. ఒకప్పుడు వరి కోతలు కొడవళ్లతో కోసేవారు. రాను రాను హార్వెస్టర్లు రావడంతో కొడవళ్లతో కోతలు కనుమరుగయ్యాయి. హార్వెస్టర్‌తో కోసిన వరి పొలాల్లో గడ్డి తక్కువగా రావడంతోపాటు పొలంలో పడి వృథాగా మారుతుంది. దీంతో రైతులు పొలాల్లో వృథాగా పడి ఉన్న గడ్డిని కాల్చేస్తున్నారు. దీంతో డెయిరీ ఫారం నిర్వాహకులకు, పాల వ్యాపారంపై ఆధారపడుతున్న రైతులకు పశుగ్రాసం కొరత ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో పలువురు రైతులు బేలర్ యంత్రాలతో గడ్డిని కట్టలుగా కట్టించేందుకు ఆసక్తి చూపుతున్నారు. కట్టలు కట్టిన గడ్డిని తెచ్చుకుంటూ..పశుగ్రాసం కొరత తీర్చుకుంటున్నారు.

ఒక్కో కట్టకు రూ.30–35

వరిగడ్డి కట్టే బేలర్ యంత్రాలు ట్రాక్టర్‌కు అనుసంధానం చేసి ఉంటాయి. హార్వెస్టర్ కోసినప్పుడు పొలమంతా పడిన గడ్డిని బేలర్ యంత్రం కట్టలు కడుతుంది. ఎకరం పొలంలోని గడ్డిని గంటలోపే దాదాపు 40 నుంచి 45 కట్టలు కడుతుంది. ఒక్కో కట్టకు రూ.30 నుంచి 35 తీసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గేదెలను పెంచే రైతులు పొలంలోని గడ్డిని తీసుకెళ్లేందుకు ముందుగా రైతులకు ఎంతో కొంత డబ్బు చెల్లించి యంత్రంతో కట్టలు కట్టిస్తున్నారు. గడ్డికి సైతం డబ్బులు వస్తుండటంతో చాలా మంది రైతులు గడ్డిని కాల్చకుండా వదిలేస్తున్నారు. సాధారణంగా మూడు నాలుగు నెలల పాటు పశుగ్రాసం వచ్చేలా రైతులు నిల్వ చేస్తుంటారు.

అకాల వర్షాలతో.. వరి గడ్డికి భలే డిమాండ్

అకాల వర్షాలతో రైతులు వరి కోయడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చైన్ మెషీన్లు దొరకక వరి కోతలకు నానాతంటాలు పడ్డారు. వర్షాలతో చైన్ మెషీన్లు వరి కోయడం వలన ఈసారి ఎండుగడ్డిపై తీవ్ర ప్రభావం చూపింది. దీంతో వరి గడ్డికి డిమాండ్ పెరిగింది. నాలుగు నెలల వరకు గడ్డి దొరికే అవకాశం లేకపోవడంతో ఆవులు, గేదెల ఫారాల రైతులు గడ్డిని కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారు. ఎకరాకు రూ.2 నుంచి 3 వేల వరకు గడ్డి కోసం ఖర్చు చేస్తున్నారు. దీంతో గడ్డికి డిమాండ్ ఏర్పడుతుంది.

గడ్డిని ఎక్కువ రోజులు నిల్వ చేసుకోవచ్చు



బేలర్ యంత్రాలు రాకముందు గడ్డి వాము పెట్టాలంటే రోజుకు ఒక్క కూలీకి రూ.600 నుంచి 7 వందల వరకు చెల్లించేవాళ్లం. బేలర్ యంత్రాలతో కట్టలు కట్టించడం వల్ల కూలీల ఖర్చు మిగలడమే కాకుండా సమయం వృథా కావడం లేదు. కట్టలు కట్టించడంతో గడ్డి పాడవకుండా ఎక్కువ రోజులు నిల్వ చేసుకోవచ్చు. – భాస్కర్, రైతు, దుబ్బాక